ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 299 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 6 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## ప్రజాపాలన అందిస్తుంటే
# విషం చిమ్ముతున్నారు

- ఓ కుటుంబం మొత్తం ప్రభుత్వం పడిపోవాలని చూస్తోంది
- అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశాం
- ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియమ్మది
- పదేళ్లలో బిఆర్ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు
- బిజెపి అధ్యక్షుడు పాలమూరుకు వచ్చి హామీలపై మాట్లాడలేదు
- బిజెపికి ఈ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాకుండా చేస్తాం
- కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సిఎం రేవంత్
- పార్టీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలని హితవు



**కరీంనగర్,ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారని సిఎం రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోందని పరోక్షంగా కెసిఆర్ కుటుంబంపై ఆరోపణలు చేశారు. తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పకుండా తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు

..మిగతా 2లో



## మేఘాలయలో ఘోర ప్రమాదం

### బొగ్గు గనిలో పేలుడు.. 16 మంది మృత్యువాత

మృతుల్లో ఎక్కువ మంది అసోం వాసులుగా అనుమానం

ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్గె ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, 16 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస

..మిగతా 2లో



## వాకింగ్‌కు అని తీసుకెళ్లి..!

భర్తను ప్రియుడితో కలసి హత్య చేసిన భార్య

హిట్ అండ్ రన్ అంటూ మాయ మాటలు

పెళ్లైన మూడు నెలలకే అఘాయిత్యం

పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారణ

2

## గ్రూప్-1 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

గ్రూప్-1 నియామకాలపై సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసిన సీజే ధర్మాసనం

ఎవరెన్ని కుట్రలు పన్నినా న్యాయపోరాటంలో విజయం సాధించామన్న సీఎం

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**



గ్రూప్-1 కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. నియామకాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సీజే ధర్మాసనం రద్దు చేసింది. గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి తీర్పును వెలువరించారు. మెయిన్స్ జవాబు పత్రాలు పునర్ మూల్యాంకనం ..మిగతా 2లో

..మిగతా 2లో

### తులం బంగారం వచ్చినోళ్లు
## కాంగ్రెస్‌కు ఓటేయండి

పదేళ్ల బిఆర్ఎస్ అభివృద్ధి...రెండేళ్ల కాంగ్రెస్ దోఖా పనులు

సిరిసిల్ల ప్రచారంలో కెటిఆర్

**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**



తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో ఫుల్ బిజీగా ఉన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బివైనగర్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారని ఆయన విమర్శించారు. 'ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పుకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి' అని కేటీఆర్

..మిగతా 2లో



## మోడీపై దాడికి కుట్ర

నిరసనల ముసుగులో విపక్షాలు ప్లాన్

నాకు ఖచ్చితమైన సమాచారం ఉంది

అందుకే ప్రధానిని సభకు రావొద్దని అన్నా

స్పీకర్ ఓం బిర్లా సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వాల్సి ఉండగా, లోక్‌సభలో విపక్షాల ఆందోళనల దృష్ట్యా స్పీకర్ ఓం బిర్లా ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతిపక్ష సభ్యులు ముందస్తు ప్రణాళికతో దాడి చేసే తరహాలో నిరసనలు తెలపడానికి సిద్ధమయ్యారని తనకు ఖచ్చితమైన సమాచారం ఉందని, అందుకే ప్రధానిని సభకు రావద్దని తానే స్వయంగా సూచించినట్లు స్పీకర్ వెల్లడించారు. దీనితో ప్రధాని ప్రసంగం లేకుండానే ధన్యవాద తీర్మానం సభలో ఆమోదం పొందింది. సభలో విపక్షాల తీరును స్పీకర్ తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్యంగా బిజెపి ఎంపి నిషికాంత్ దూబే

..మిగతా 2లో

# రోజూ రెండు కిలోల తిట్లు తింటా

నా ఆరోగ్య రహస్యం ఇదే... సభలో ప్రధాని మోడీ వ్యాఖ్యలు

రాజ్యసభలో నవ్వులే నవ్వులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ, కాంగ్రెస్ చేసిన తప్పిదాలను సరిచేసేందుకే ఎక్కువ సమయం గడిచిపోతోందని ధ్వజమెత్తారు. ప్రపంచంలో భారత్‌పై నెలకొన్న అప్రతిష్ఠను తొలగించేందుకు చాలా కష్టపడాల్సి వస్తోందని అన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు, టీఎంసీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నా ప్రజల కోసం ఏం చేయలేదని విమర్శించారు. ఈ క్రమంలోనే 2002 నుంచి కాంగ్రెస్ తనపై దూషణలు చేస్తూనే ఉందని మోదీ అన్నారు. "విపక్ష నేతల దూషణలే నా ఆరోగ్య రహస్యం. సభలో 25 ఏళ్లుగా కాంగ్రెస్ నన్ను అవమానిస్తూనే ఉంది. నన్ను ఒకరు మీ ఆరోగ్య రహస్యం ఏంటని అడిగారు. రోజూ రెండు కిలోల తిట్లు తింటాను అని



చెప్పాను." అనగానే సభలో నవ్వులు పూశాయి. "గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. యూపీఏ హయాంలో భారత్ పరిస్థితులు పూర్తిగా దిగజారాయి. ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించాం. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశాం. పాకిస్థాన్‌ను వారి దేశంలోనే ఢీకొట్టాం. కాంగ్రెస్ నేతలు మాత్రం

..మిగతా 2లో

## రీల్స్ పిచ్చిలో బైక్ స్టంట్లు

ప్రాణాలు కోల్పోయిన యువకుడు

కడప ఎయిర్ పోర్టు రోడ్డులో ఘటన



**కడప, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

సోషల్ మీడియాలో వ్యూస్, లైకుల కోసం యువత ఇటీవల చేస్తున్న సాహసాలు వారి ప్రాణాల మీదకు తెస్తున్నాయి. వేగంగా వెళ్లే బైక్‌లపై నిలబడటం, కాళ్లతో రోడ్డును రాపిడి చేయడం(స్కేటింగ్), చేతులు వదిలేసి వాహనం నడపడం వంటివి.. ప్రమాదాలకు కారణమవుతున్నాయి. తాజాగా ఇలాంటి ఘటనే ఒకటి కడప జిల్లాలో జరిగింది. నగర శివారులోని ఎయిర్‌పోర్ట్ రోడ్డు విశాలంగా ఉండటంతో యువత తరచూ ఇక్కడ స్టంట్లు చేయడానికి ప్రయత్నిస్తుంటారు. ఈ

..మిగతా 2లో

# ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారు

మొదటి పేజీ తరువాయి...

చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. దేశంలోని భాజపా అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం అని రేవంత్ అన్నారు. భాజపా, బీఆర్‌ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్‌ఎస్ రంకెలేస్తోంది. బీఆర్‌ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం..మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్‌ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా




తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థలకు దిశానిర్దేశర చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్ధాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మేఘాలయలో ఘోర ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## తులం బంగారం వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పోటీ గత పదేళ్లలో ప్రజల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన బీఆర్‌ఎస్ పార్టీకి, గడిచిన రెండేళ్లలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్నదని కేటీఆర్ చెప్పారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీని గనుక ఈ మున్సిపల్ ఎన్నికల్లో నిలదీయకుంటే, ఇచ్చిన హామీల మోసంపైన ప్రశ్నించకుంటే, మరో మూడు సంవత్సరాల దాకా అంటే శాసనసభ ఎన్నికల వరకు ప్రజలకి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే అధికారం, అవకాశం రాదని చెప్పారు. ఇప్పుడు గనుక ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేసేలా సురుకు పెట్టకుంటే కాంగ్రెస్ పార్టీ తన మోసాలను కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు తులం బంగారం ఇస్తానన్నారు. కానీ, వాళ్లు ఉన్న పుస్తెలు ఎత్తుకు పోయే రకం. నాపై కోపంతో బతుకమ్మ చీరలు బంద్ చేశారు. నేతన్నల బతుకుదెరువుపై దెబ్బ కొట్టారు. దేవుని గుడి వద్ద ఉండి అడుక్కుతినేవారిలాగా, దేవుని పేరుతో ఓట్టడుక్కోవడానికి మాత్రమే బీజేపీ వారే వస్తారు. అలానే కాంగ్రెస్ కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారు. తులం బంగారం వచ్చిన వారు కాంగ్రెస్ కు ఓటెయ్యండి, రానివారు బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యండి. సిరిసిల్ల బతుకుదెరువు లేకుండా చేసినోడికి, గట్టి బుద్ధి చెప్పాలి' అని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వార్డుల ప్రజలను, పట్టణ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

## గ్రూప్-1 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

మొదటి పేజీ తరువాయి...

చేయాలని గతంలో పేర్కొన్నారు. సింగిల్ జడ్జి ఆదేశాలపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ), ఎంపికైన అభ్యర్థులు అప్పీల్ చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం తాజాగా తీర్పును వెలువరించింది. గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన 562 మందికి ఇప్పటికే ప్రభుత్వం నియామక పత్రాలను అందజేసింది.

హైకోర్టు తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్‌రెడ్డి : గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు వెలువరించిన తీర్పును సీఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఎన్ని కుట్రలు పన్నినా న్యాయపోరాటంలో విజయం సాధించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన 563 మంది గ్రూప్-1 అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి గ్రూప్-1 అధికారులైన మీరంతా రాష్ట్ర పునర్నిర్మాణానికి అంకితం కావాలని పిలుపునిచ్చారు.

ఇవీ కేసు పూర్వపరాలు : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) 2024 ఫిబ్రవరిలో గ్రూప్-1లో 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2024 అక్టోబరు 21వ తేదీ నుంచి 27 వరకు ప్రధాన పరీక్షలు(మెయిన్స్) జరిగాయి. మార్చి 30న ప్రధాన పరీక్షలో అన్ని పేపర్లకు హాజరైన 21,085 మంది అభ్యర్థుల మార్కులను టీజీపీఎస్సీ ప్రకటించింది. అర్హత పరీక్ష ఇంగ్లీష్‌తో పాటు ప్రధాన పరీక్షలైన ఆరు పేపర్ల మార్కులను వెల్లడించింది.


అయితే టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం, ఎగ్జామ్ సెంటర్ల కేటాయింపులో అవకతవకలు, తెలుగు మాధ్యమంలో జవాబులు రాసిన వారికి అన్యాయం జరిగిందంటూ పలువురు అభ్యర్థులు కొద్ది రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సుదీర్ఘ విచారణ చేపట్టి తీర్పును వెలువరించారు. ఆన్సర్ పేపర్లు దిద్దిన వారిలో ఎక్కువ మందికి తెలంగాణ చరిత్రపై అవగాహన లేదని, దానివల్ల మార్కుల కేటాయింపులో అన్యాయం జరిగిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. సబ్జెక్ట్ నిపుణులతోనే జవాబు పత్రాల ముల్యాంకనం జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరఫు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు.

సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసిన సీజే ధర్మాసనం : అభ్యర్థుల పిటిషన్లపై విచారణ ముగిసిన తరువాత జవాబు పత్రాలు తిరిగి మూల్యాంకనం చేయాలని లేకుంటే మరోసారి పరీక్ష నిర్వహించాలంటూ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం కొద్ది రోజుల క్రితం తీర్పును వెలువరించింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీలు చేయగా సింగిల్ జడ్జి తీర్పు అమలును హైకోర్టు నిలిపివేసింది. దీంతో కమిషన్ తుది ఎంపికకు సంబంధించిన ఫలితాలను వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గ్రూప్-1 పోస్టుల నియామకాలు చేపట్టడం ఇదే తొలిసారి. తుది ఎంపికలు హైకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని టీజీపీఎస్సీ ప్రకటించింది.

## వాకింగ్‌కు అని తీసుకెళ్లి..!

మొదటి పేజీ తరువాయి...

అంకిత్ అనే వ్యక్తి తన భార్యతో వాకింగ్ కు వెళ్లాడు. కానీ దారిలో ప్రమాదానికి గురై చనిపోయాడు. ఓ వాహనం వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో ఆ భార్య తన పసుపు, కుంకుమలు చెరిగిపోయాయని రోదించారు. కానీ తర్వాత తెలిసిందేమిటంటే.. ఆమె తన భర్తను ప్లాన్ చేసి.. హిట్ అండ్ రన్ ద్వారా హత్య చేయించింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో ఈ దారుణం వెలుగుచూసింది. బాధితుడు అంకిత్ కు అదే ప్రాంతానికి చెందిన షాలిని తో కేవలం మూడు నెలల క్రితమే వివాహం జరిగింది. అయితే, పెళ్లికి ముందే షాలినికి అక్షిత్ అనే యువకుడితో అక్రమ సంబంధం ఉంది. తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన షాలిని, ఎలాగైనా అతడిని వదిలించుకోవాలని తన ప్రియుడు అక్షిత్‌తో కలిసి పక్కా స్కెచ్ వేసింది. పథకం ప్రకారం, అంకిత్‌ను ఓ రోజు.. వాకింగ్ కు తీసుకెళ్లింది. రోడ్డుపై వెళ్తుండగా వాహనంతో బలంగా ఢీకొట్టి చంపేశారు. అది కేవలం ఒక సాధారణ రోడ్డు ప్రమాదం అని అందరూ నమ్మేలా సీన్ క్రియేట్ చేశారు. ప్రాథమికంగా ఇది ప్రమాదమని భావించినప్పటికీ, మృతుడి కుటుంబ సభ్యుల అనుమానం , పోలీసుల లోతైన విచారణలో అసలు నిజాలు బయటపడ్డాయి. అంకిత్ మరణించిన సమయంలో షాలిని, ఆమె ప్రియుడి ఫోన్ లొకేషన్లు, కాల్ డేటాను విశ్లేషించగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. ముజఫర్‌నగర్ పోలీసులు ఈ కేసులో సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్నారు. ప్రధాన నిందితురాలు షాలిని, ఆమె ప్రియుడు అక్షిత్ తో పాటు, ఈ హత్యకు సహకరించిన మరో ఇద్దరు అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతోనే అంకిత్‌ను చంపినట్లు వారు అంగీకరించారు. నిందితుల వద్ద నుంచి హత్యకు వాడిన వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మూడు ముళ్ల బంధాన్ని గౌరవించకుండా, కట్టుకున్న వాడిని కాలయముడిలా మారి హతమార్చిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. కేవలం మూడు నెలల వైవాహిక జీవితాన్ని బలితీసుకున్న ఈ ముఠాకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.





## మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 5(ప్రభాత ఉదయం)

ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత గా పని చేయాలని సంబంధిత అధికారులకు ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్ సూచించారు. గురువారం శంకర్ పల్లి మున్సిపాలిటీకి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్, పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శంకర్ పల్లి మున్సిపాలిటీకి సంబంధించిన ఏర్పాట్లను, ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తు అధికారులకు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికలకు సంబంధించిన స్టేషనరీ తదితర అంశాలను మున్సిపల్ కమిషనర్ యోగేష్ ను అడిగి తెలుసుకొని వాటిని పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అన్నీ వసతులు కల్పించాలని, స్ట్రాంగ్ రూమును, కౌంటింగ్ హాల్ ను, పోలింగ్ నిర్వహించే పాఠశాలను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగే విధంగా అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కౌంటింగ్ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ వివరించారు. కలెక్టర్ వెంట శంకర్ పల్లి తహశీల్దార్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## మోడీపై దాడికి కుట్ర

మొదటి పేజీ తరువాయి...

ప్రసంగం సమయంలో కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ తన ఛాంబర్‌కు వచ్చి ప్రవర్తించిన తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ ప్రధానులపై నిషికాంత్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష మహిళా ఎంపీలు ప్రధాని మోదీ కేటాయించిన సీటు వద్దకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలపడం సభా మర్యాదలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. మరోవైపు విపక్షాలు తమ వాదనను బలంగా వినిపిస్తున్నాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వనప్పుడు, ప్రధానిని కూడా మాట్లాడనివ్వబోమని కాంగ్రెస్ పరోక్షంగా సంకేతాలు ఇచ్చింది. సభలో తమ గొంతు నొక్కేస్తున్నారని, ఎంపీల సస్పెన్షన్ మరియు ఇతర పరిణామాలు ప్రజాస్వామ్యానికి మచ్చ అని రాహుల్ గాంధీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. నిషికాంత్ దూబే చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. యం నిషికాంత్ దూబే ప్రసంగంలోని కొన్ని అభ్యంతరకర భాగాలను రికార్డుల నుండి తొలగించినట్లు తెలిపింది. అయితే, ప్రధాని సమాధానం చెప్పకుండానే ధన్యవాద తీర్మానం ఆమోదం పొందడం పార్లమెంటరీ చరిత్రలో ఒక అరుదైన, వివాదాస్పద అంశంగా మారింది. అధికార, ప్రతిపక్షాల మధ్య పెరుగుతున్న ఈ ఘర్షణ వాతావరణం బడ్జెట్ సమావేశాల కొనసాగింపుపై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది.

## రీల్స్ పిచ్చిలో బైక్ స్టంట్లు

మొదటి పేజీ తరువాయి...

క్రమంలోనే ముబారక్(20) అనే యువకుడు బుధవారం తన స్నేహితుడితో కలిసి స్కూటీపై వెళ్తూ.. రీల్స్ కోసం స్కేటింగ్ స్టంట్లు చేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి అతడు కిందపడిపోయాడు. ముబారక్‌కు తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో యువకుడికీ తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో సదరు యువకుణ్ని మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ రోడ్డు వంటి నిర్మానుష్య ప్రాంతాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ.. యువత అర్ధరాత్రి సమయాలను ఎంచుకుని ఇలాంటి విన్యాసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ప్రమాదాల్లో తలకు తగిలే దెబ్బలే మరణానికి ప్రధాన కారణమవుతున్నాయని పోలీసులు తెలిపారు. రోడ్లు ఖాళీగా ఉన్నాయని అతివేగంతో వెళ్లడం, విన్యాసాలు చేయడం ప్రాణాంతకమని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో రీల్స్‌కు వచ్చే లైకుల కంటే నిజ జీవితంలో మన ప్రాణం, కుటుంబం ముఖ్యమన విషయాన్ని యువత గుర్తించాలని పోలీసులు సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో రీల్స్ చేయడం కోసం స్టంట్‌లు చేస్తున్నారని.. ఆయా ఘటనలలో యువత విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని పోలీసులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని కడప జిల్లా పోలీసులు స్పష్టం చేశారు.

## రోజూ రెండు కిలోల తిట్లు తింటా

మొదటి పేజీ తరువాయి...

నా వినాశనం కోరుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలు సిక్కులను ద్వేషించారు. ఇప్పటికీ క్షమాపణ కోరలేదు. భారత అభివృద్ధిపై కాంగ్రెస్‌కు ఎలాంటి విజన్ లేదు. కాంగ్రెస్ హయాంలో జనాభాను సమస్యగా భావించారు. నెహ్రూ హయాంలో 35 కోట్ల జనాభాను సమస్యగా భావించారు. నేను మాత్రం 140 కోట్ల జనాభాను పరిష్కారకర్తలుగా భావిస్తున్నా. వ్యవస్థలను అవమానించడం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉంది. రాష్ట్రపతిని లోక్‌సభలో కాంగ్రెస్ నేతలు అవమానించారు. రాష్ట్రపతిని అవమానించడమంటే ప్రజాస్వామ్యాన్ని అవమానించినట్లే. నేను సీఎంగా ఉన్నప్పుడు అభివృద్ధి గురించి కాంగ్రెస్‌ను ప్రాధేయపడ్డాను. కాంగ్రెస్ ప్రాజెక్టుల ప్రకటన మాత్రమే చేసింది, అమలు చేయలేదు." అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

# న్యాయవాది స్వప్న హంతకులను శిక్షించాలి





స్వప్న హంతకులను శిక్షించాలని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు

**బుద్వేల్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

దారుణ హత్య కు గురైన న్యాయవాధి స్వప్న హంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతు రాజేం ద్రనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 200 మంది న్యాయవాదులు గురువారం రోడెక్కారు. పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాజేంద్రనగర్ పోలీసులు వారించిన పట్టించుకోకు డ కిలోమీటరు దూరం ర్యాలీ నిర్వహించారు. ఉప్పర్ పల్లి లో గల రాజేంద్రనగర్ కోర్టులలో విధులను బహిష్కరించి నిరసనలో పాల్గొన్నారు. అనంతరం రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె యాదగిరి, జి బందయ్య లు మాట్లాడుతూ, న్యాయవాది స్వప్న కేసును పాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి హంతకులకు శిక్ష పడేలా చూడాలన్నారు. న్యాయవాధుల రక్షణ కోసం రాష్ట్రంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్ ను తీసుకురావాలన్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే స్వప్న హత్యకు గురైందన్నారు. తనపై రెండు సార్లు హత్యాయత్నం జరిగిందని న్యాయవాది స్వప్న మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసిందని. ఎఫ్ ఐఆర్ నమోదు చేసి స్వప్న చెప్పిన వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సీసీ ఫుటేజీ ఆధారాలు లేవని వదిలేశారన్నారు. నిరసన ర్యాలీ లో రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పుర్ణచందర్ రెడ్డి అమర్నాథ్ రెడ్డి, రవికాంత్ రెడ్డి , జి.రాజేందర్, కోరని వరప్రసాద్, ఫ్లోరెన్స్, శ్రావణి, వినోద, సునీత, భానుప్రియ తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



బృందావన్ కాలనీ లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటన

## బృందావన్ కాలనీలో కార్పోరేటర్ పర్యటన

**బుద్వేల్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

మైలార్దేవుపల్లి డివిజన్ బృందావన్ కాలనీలో గురువారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కాలనీ లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. డివిజన్ అభివృద్ధికి గడిచిన పది సంవత్సరాలలో కోట్లాది రూపాయలను తీసుకువచ్చి పనులు చేయించడం జరిగిందన్నారు. నిరంతరం మైలార్దేవుపల్లి డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కాలనీ లో జరుగుతున్న డ్రైనేజీ పైపు లైన్ పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. నాణ్యత లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో నాయకులు గోద పాండు, పి.సంతోష్ గౌడ్, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కొత్తకోటలో జోరుగా బిఆరెస్ ప్రచారం

### ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**కొత్తకోట, ఫిబ్రవరి 5(ప్రభాత ఉదయం)**

కొత్తకోట మున్సిపాలిటీలో ని 1, 2,3 వార్డులో బిఆరెస్ ఎన్నికల ప్రచారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జోరుగా కొనసాగించారు. ఆయా వార్డుల అభ్యర్థులు, బిఆరెస్ నాయకులతో కలిసి వార్డులో ఇంటింటికి తిరుగుతూ కార్ గుర్తుకు ఓటు వెయ్యాలని కోరారు. కెసిఆర్ ఇచ్చిన పథకాలే ఇంకా కొనసాగుతున్నాయని తప్పకుండ కార్ గుర్తుకు ఓటు వేస్తామని మహిళలు, వృద్ధులు ముక్తకంఠంతో మాజీ ఎమ్మెల్యే కు చెప్పారు. కార్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం లో కెసిఆర్ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓటు అడిగారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆలన్న మాట్లాడుతూ కొత్తకోట గ్రామపంచాయతీగా ఉన్నదాని మున్సిపాలిటీగా చేసింది కెసిఆర్ ప్రభుత్వమే అని అన్నారు. కొత్తగా అయిన మున్సిపాలిటీకి 50 కోట్ల నిధులు తెచ్చి మరింత అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ ఎన్నికల్లో బిఆరెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రభుత్వంతో కొట్లాడి అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయేది బిఆరెస్ ప్రభుత్వమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ మండల అధ్యక్షులు వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయమ్మ, బిఆరెస్ మున్సిపల్ అభ్యర్థి యాదగిరి, ఆయా వార్డుల అభ్యర్థులు, బిఆరెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన మజ్లిస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు షేక్ రియాజ్

## బీఆర్ఎస్‌లో చేరికకు పలువురు ఆసక్తి

**బుద్వేల్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీలో చేరికలు జోరందుకున్నాయి. పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి సమక్షం లో పలువురు యువకులు, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ లో చేరడానికి ముందుకు వస్తున్నారు . రాజేంద్రనగర్ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులుగా ఉన్న షేక్ రియాజ్ గురువారం తన అనుచరులతో కార్తీక్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి తో కలసి ఆయన కార్తీక్ రెడ్డి తో కలిశారు. తనకు అవకాశం కల్పిస్తే వచ్చే ఆదివారం తన అనుచరులతో కలసి రాజేంద్రనగర్ లో సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ లో చేరతానని తెలిపారు. అదే రోజు ఉదయం గగన్ పహాడ్ కు చెందిన బీజేపీ నేత శీలం తిరుపతిరెడ్డి తన అనుచరులతో కలసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ లో చేరడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారుతుండటంతో బీఆర్ఎస్ లో చేరికలు ఎక్కువవుతున్నాయి.



పులి పాద ముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

## దేవరుప్పుల మండల శివారు గ్రామాలలో పెద్ద పులి సంచరం

### నిర్ధారించిన ఫారెస్ట్ అధికారులు

### రాత్రి పూట ఒంటరిగా తిరుగరాదు

### పశువులను ఇంటి దగ్గర కట్టేసుకోగలరు

### దేవరుప్పుల ఎస్ఐ ఊర సృజన్ కుమార్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 05(ప్రభాత ఉదయం):**

జిల్లా లోని దేవరుప్పుల మండల శివారు లో సీతారాంపురం కడవెండి గ్రామం లో కూటికంటి ఎల్లయ్య వ్యవసాయ భూమి వద్ద పెద్దపులి సంచారించినట్టు పాద ముద్రలను గురువారం ఫారెస్ట్ అధికారులు కనుగొన్నరు. ఈ సందర్భంగా దేవరుప్పుల ఎస్ఐ ఊర సృజన్ కుమార్ ప్రజలకు పోలీస్ శాఖ వారి తరుపున చుట్టూ పక్కల మండలంలో, మన మండల శివారు గ్రామాలలో పెద్ద పులి సంచరించు చున్నది కావున రాత్రి పూట ఎవరు ఒంటిరిగా తిరుగవద్దని, పశువులను కూడా ఇంటి దగ్గర కట్టేసుకోవాలని, అవసరం అయితే గుంపులుగా వెళ్లాలన్నారు. ఒకవేళ పులి కనిపించినట్టయితే పోలీసులకు గాని ఫారెస్ట్ అధికారులకు కానీ వెంటనే తెలియజేయాలని ఈ సందర్భంగా ప్రజలకు కోరారు. పెద్దపులి దేవరుప్పుల మండలం నీర్మల గ్రామం మిధుగ సంచరించు కుంటూ లింగాలఘంపురం మండలం కుందారం గ్రామం మీదగ రఘునాథ పల్లి వైపు వెళ్లిందని అటవీ అధికారులు తెలిపారు.




రాజేంద్రనగర్ లోని ఈవీఎం గోదాము ను తనిఖీ చేసిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి


## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**బుద్వేల్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం వెనుకాల ఉన్నటువంటి ఈవీఎం గోదాము ను గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తనిఖీ చేశారు. ఈవీఎం గోదాముల వద్ద బందోబస్తు ఎలా ఉంది, ఈవీఎం ల ను పరిశీలించారు. సాదారణ తనిఖీ లలో బాగంగా ఈవీఎం గోదాము ను సందర్శించారు. ఈ తనిఖీలలో రాజేం ద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు ఉన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 5(ప్రభాత ఉదయం)**




రంగారెడ్డి జిల్లా రాజేందర్ నగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ తో కలిసి గురువారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు.కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.




## ఎమ్మెల్యే జి ఎం ఆర్ వల్లే అభివృద్ధి సాధ్యం

### హస్తం గుర్తుకు ఓటు వేసి

### భారీ మెజార్టీతో పల్లవి కృష్ణారెడ్డిని గెలిపించండి

**కొత్తకోట, ఫిబ్రవరి 5(ప్రభాత ఉదయం)**

మున్సిపాలిటీ కేంద్రంలో 13వ వార్డు అభ్యర్థి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి బలపరుస్తున్న అభ్యర్థి పాపయ్య గారి పల్లవి కృష్ణారెడ్డి గారు గురువారం వివిధ వార్డులో జోరుగా గడప గడప ప్రచారం నిర్వహించారు.వార్డు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తారని వార్డులో ఇంటింటికి తిరిగి సమస్యలను గుర్తించి పనిచేసే అభ్యర్థి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు.బిఆర్ఎస్, బిజెపి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ లివెంకట్ నారాయణ, ఎం డి. లతీఫ్, ప్రచార కార్యదర్శి పి మోహన్ రెడ్డి, అప్పరాల సర్పంచ్ మాసన్న, కేశవులు, కిరణ్ రెడ్డి, మణి వర్ధన్ రెడ్డి, మదనపురం రామకృష్ణ,లిఎం వెంకటేశ్వర్ రెడ్డి, ఎం డి మతిన్, ఎండి అప్రోచ్,సాక చెన్నయ్య, బాలకృష్ణారెడ్డి, లిమాధవరెడ్డి, రవి, కొంగరి వెంకటయ్య, విష్ణు,పెద్ద ఎత్తున మహిళలు యువత ప్రజలు పాల్గొని ప్రచారం నిర్వహించారు.



## చేవెళ్లలో కమల వికాసం ఖాయం

### చేవెళ్ల మున్సిపాలిటీలో రాజేంద్రనగర్ బిజెపి నాయకుల ప్రచారం

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి05(ప్రభాత ఉదయం)**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో చేవెళ్ల మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ గెలుపుకు పనిచేయాలని రాజేంద్రనగర్ బిజెపి నాయకులు నిర్ణయించారు.ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ...చేవెళ్ల మున్సిపాలిటీలోని వార్డు కౌన్సిలర్ అభ్యర్థులకు పార్టీ నాయకులు,కార్యకర్తలు అండగా ఉండాలని అన్నారు.ఈ మేరకు పార్టీ శ్రేణులు స్థానికంగా అందర్నీ కలుపుకొని తిరుగుతూ బిజెపి ఓటు బ్యాంకును పదిలం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ మేరకు ప్రతి కార్యకర్త బూతు స్థాయిలో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాబువాలి,మాజీ ఎమ్మెల్యే రత్నం,డిస్ట్రిక్ట్ చేవెళ్ల ఇంచార్జ్ మల్లేష్ యాదవ్,స్టేట్ ఓబీసీ మోర్చా సత్యనారాయణ ముదిరాజ్,జిల్లా ఎగ్జిక్యూటివ్ సబదా, విజయ కుమార్,జిల్లా ఐటీసెల్ కన్వీనర్ చేదం వెంకటరమణగుప్తా,అసెంబ్లీ ఓబీసీ సెల్ కన్వీనర్ బొమ్మరాజు,నరసింహ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూపులు ప్రక్కన పెట్టి, ఒక్కటిగా ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నీలం మధు ముదిరాజ్, కాట శ్రీనివాస్ గౌడ్





**ఇంద్రేశం మున్సిపాలిటీ లో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం**

**అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని వినతి**

**కాంగ్రెస్ లో చేరిన పలు పార్టీల నాయకులు**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం):**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్, పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ లు కలిసి కాంగ్రెస్ ప్రచారాన్ని నిర్వహించారు.గురువారం ఇంద్రేశం మున్సిపాలిటీలలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇద్దరు నేతలు కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.మున్సిపాలిటీ పరిదిలో వార్డు నంబర్ 15 బచ్చుగుడా లో కాంగ్రెస్ అభ్యర్థి సరితను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారెంటీలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పటాన్ చెరు ప్రాంత అభివృద్ధి కి కాంగ్రెస్ ప్రత్యేక ప్రణాళిక తో ముందుకు సాగుతుందని తెలిపారు. ఇప్పటికే ఇంద్రేశం మున్సిపాలిటీకి రూ.15 కోట్ల ప్రత్యేక నిధులను అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఆ నిధులతో ప్రజల మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తూ పనులు ప్రారంభిస్తామని వివరించారు.అధికారంలో ఉన్న పార్టీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమని ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి చెయ్యి గుర్తు పై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలు పార్టీల నేతలు కరుణాకర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, కిష్ట రెడ్డి, వెంకట్ రెడ్డి, 40 మంది తదితరులు కాంగ్రెస్ లో చేరారు. వారికి నీలం మధు ముదిరాజ్, కాట శ్రీనివాస్ గౌడ్ లు కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..



## గడ్డపోతారంలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నాయకుల ప్రచారం

**పటాన్ చెరు ఫిబ్రవరి 5(ప్రభాత ఉదయం):**

ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.మున్సిపల్ సాధారణ ప్రచారం గడ్డపోతారంలో ఊపందుకుంది. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ పార్టీ నాయకులు వి.చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ జనాభాయి గడపగడపకు వెళ్లి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ప్రజా పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్‘కు వెన్ను దన్నుగా నిలిచి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ తోనే మున్సిపాలిటీల సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని ఓటర్లకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థులు, బొల్లారం డివిజన్, గడ్డపోతారం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## బ్రైట్ మూల్యాంకన సంస్థ నిర్వహించిన పోటీల్లో వశిష్ట పాఠశాల విద్యార్థులకు ద్వితీయ బహుమతి

**పటాన్ చెరు, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

(ప్రభాత ఉదయం): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు మూల్యాంకనం అందిస్తున్న బ్రైట్ మూల్యాంకన సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ వశిష్ట ద స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. నాలుగు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్న మైండ్ మాస్టర్స్ పోటీల్లో వశిష్ట ద స్కూల్ కి చెందిన ఐదవ తరగతి విద్యార్థులు సోమశేఖర్, అభినవ్, తేజస్విని పాల్గొన్నారు. కన్వర్షన్ ఆఫ్ ఎనర్జీ కెమికల్ టు లైట్ ఎనర్జీ పోటీల విభాగంలో ఐదవ తరగతి విద్యార్థులు సోమశేఖర్,వెంకట శరత్, నాలుగో తరగతి విద్యార్థులు దీక్షిత్ రాజ్,తెహినీయత్ అనే నలుగురు విద్యార్థులకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు ఎన్ లోకనాధం అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని పోటీల్లో పాల్గొని తమ ప్రతిభకు గుర్తింపు పొందాలని సూచించారు.



## నల్ల చెరువు సుందరీకరణకు మోక్షం లభించింది:రజిత పరమేశ్వర్ రెడ్డి

**నల్లచెరువు పరిశీలించిన హైడ్రాక్ కమిషనర్ రంగనాథ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఉప్పల్ డివిజన్ ) ఫిబ్రవరి 05 ( ప్రభాత ఉదయం ):**

ఉప్పల్ నల్లచెరువు సుందరీకరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చలువతో మోక్షం లభించిందని స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం ఉప్పల్ నల్ల చెరువును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ నల్లచెరువు సుందరీకరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చలువతో మోక్షము లభించిందని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 20 కోట్ల రూపాయల నిధులతో నల్ల చెరువు సుందరీకరణకు శ్రీకారం చుట్టినట్లు వారు చెప్పారు. అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ 20 కోట్ల రూపాయలతో నల్ల చెరువును అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.నల్ల చెరువులో అభివృద్ధి, సుందరీకరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ సంబంధిత అధికారులకు సూచించారు.చెరువు పరిసర ప్రాంతాలలో కబ్జాలను సైతం త్వరలోనే తొలగించనున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈగ అంజయ్య ముదిరాజ్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, అలుగుల అనీల్ కుమార్, మంద మురళి, కృష్ణ రెడ్డి, జనగాం రామకృష్ణ, సుంకు శేఖర్ రెడ్డి, గౌరిగే మహేష్, ఆల్వాల భాస్కర్, ప్రేమ్, ఢిల్లీ చంద్రశేఖర్ రెడ్డి, కాటపల్లి విజయకుమార్, సిఎస్ నరేష్, రంగుల శేఖర్ ముదిరాజ్, ప్రశాంత్ రెడ్డి, ఎండీ అఫ్జల్, తుమ్మల రాజేందర్ రెడ్డి, మోహన్, మోహన్ నాయక్, చింతకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చిట్కుల్‌లో కాంగ్రెస్ వినూత్న ప్రచారం

**4వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి నీలం కవితకు మద్దతుగా**

**ఇందిరమ్మ చీరలు ధరించి**

**కాంగ్రెస్ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం):**

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చిట్కుల్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వినూత్న ప్రచారం నిర్వహించారు.ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 4 వ వార్డు పరిధిలోని లక్ష్మి నగర్ కాలనీలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి నీలం కవితకు మద్దతుగా మహిళలు ఇందిరమ్మ చీరలు ధరించి ప్రచారం నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేసిన ఇందిరమ్మ చీరలను ధరించి మహిళలు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి నీలం కవిత ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందిస్తున్నారని ప్రచారం లో వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు ఉచిత బస్ ప్రయాణం, గృహ లక్ష్మీ పథకం ద్వారా ప్రతి పేదోడి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించడంతో పాటు మహిళలలకు వడ్డీ లేని ఋణాలు అందిస్తూ మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న చేయూత ను గుర్తు చేశారు. మహిళల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును గమనించి ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మహిళలు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.




## ఈనెల 7న జె ఎన్ టీయూ 14వ స్నాతకోత్సవం

**82,547 మంది విద్యార్థులకు యూజీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం**

**యూనివర్సిటీ వి సి కిషన్ కుమార్ రెడ్డి**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ పద్నాలుగవ స్నాతకోత్సవం ఈనెల 7న నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వి సి కిషన్ కుమార్ రెడ్డి ప్రకటించారు. స్నాతకోత్సవం అనంతరం విశ్వవిద్యాలయం సాధించిన ముఖ్యమైన అకడమిక్, పరిపాలనా, పరిశోధనా, అభివృద్ధి సంబంధిత మైలురాళ్లను ఈ సందర్భంగా ప్రకటిస్తామన్నారు. మొత్తం 82,547 మంది విద్యార్థులకు యూజీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేయబడతాయి. వీటిలో 87 డాక్టరల్ డిగ్రీలు ఉన్నాయి. ఈ సంవత్సరానికి విశ్వవిద్యాలయం 71 గోల్డ్ మెడల్స్‌ను ప్రవేశపెట్టినట్టు విసీ తెలిపారు. పరిపాలనను మరింత సమర్థవంతంగా, శ్రద్ధతో నడిపించేందుకు ముఖ్యమైన నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టామన్నారు. వివరాలను విసి గురువారం జె ఎన్ టి యు లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.పరిశ్రమల భాగస్వామ్యంతో కొత్త పాఠ్యక్రమాలు, ఆర్ 25 నిబంధనల అమలు, పరిశోధనకు 11 కోట్ల గ్రాంట్లు, అంతర్జాతీయ యూనివర్సిటీలతో ఎంఓయూలు, స్టార్టప్స్ ప్రోత్సాహం వంటి చర్యలు తీసుకున్నట్లు వీసీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ డాక్టర్ కె. విజయ కుమార్ రెడ్డితో పాటు విశ్వవిద్యాలయ డైరెక్టర్లు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# గజ్వేల్ ఘనత చాటుదాం

**మున్సిపల్ ప్రచారంలో హరీష్ రావు పిలుపు**

**సిద్దిపేట,ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం)**

కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధి ప్రదాత అని గజ్వేల్‌లో బీఆర్ఎస్‌ను మళ్ళీ గెలిపించుకోవాలని ఆ పార్టీ నేత, సిద్దిపేట ఎమెల్యే హరీష్‌రావు అన్నారు. చెప్పారు. 'కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎట్లుండే..? ఇప్పుడు ఎట్లుందన్నది ఆలోచించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్‌లో హరీష్‌రావు పర్యటించారు. అక్కడ పార్టీ శ్రేణులు నిర్వహించిన భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అభివృద్ధిని, రేవంత్‌రెడ్డి వైఫల్యాలను ఎండగట్టారు. 'గజ్వేల్‌లో ఎన్నికలు వచ్చాయి. మనకు అన్నం పెట్టిన వాళ్లకు, మనకు పని చేసిన వాళ్లకు, మనల్ని మంచిగా చూసుకున్న వాళ్లకే ఓటేయాలి. సద్దితిన్న రేవు తలవాలి' అని చెప్పారు. ప్రజ్ఞాపూర్-గజ్వేల్ రోడ్డు అప్పుడు ఎట్లుండే..? ఆ రోజు గజ్వేల్ దవాఖాన పందులకు నిలయంగా ఉండేది. ఈ రోజు 250 పడకల ఆసుపత్రి తెచ్చి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించింది కేసీఆర్. గజ్వేల్‌కు ఆర్డీవో ఆఫీస్, రైలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఊర చెరువు, పాండవుల చెరువు సుందరీకరణ చేసింది కేసీఆర్ కాదా..? కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డ పెళ్లికి 1,00,116 అందించి మేనమామలా ఆదుకున్నది కేసీఆర్. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవిస్తే కేసీఆర్ కిట్‌తోపాటు 13,000 అందించిన ఘనత కేసీఆర్‌ది' అన్నారు. 'మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ బిడ్డల కోసం



గురుకులాలు స్థాపించి చదువుల విప్లవం తెచ్చింది కేసీఆర్. ఒకప్పుడు గజ్వేల్‌లో మూడు రోజులకోసారి నీళ్లు వచ్చే పరిస్థితి పోయి.. ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీళ్లు అందించారు. బిందెలు పట్టే కష్టం లేకుండా చేసి, మహిళల కష్టాలు తీర్చింది కేసీఆర్. రైతుబంధు ఎందుకు వేయలేదు అంటే ఎలక్షన్ అయ్యాక ఇస్తా అంటున్నాడు రేవంత్. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ 11 సార్లు రైతుబంధు ఆపలేదు. ఇంటింటికీ బియ్యం, మందులు పంపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఇప్పటికీ రెండు రైతుబంధులు ఎగ్గొట్టిండు. ఇది మూడోది. ఎగ్గొట్టిన రెండు, ఇప్పుడు రావాల్సిన ఒకటి కలిపి మూడు రైతుబంధులు వెంటనే వేయాలని డిమాండ్ చేస్తున్నాం. కావాలంటే మాకు అభ్యంతరం లేదని ఎలక్షన్ కమిషన్‌కు మేమే లేఖ ఇస్తాం. 11వ తేదీలోగా రైతుబంధు వేయకపోతే రైతులు నిన్ను చీల్చి చెండాడుతారు' అని హరీష్‌రావు హెచ్చరించారు. 'త్యాగాలతో, ఆమరణ దీక్షతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు, తెలంగాణ జాతిపిత కేసీఆర్. రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే చాలు బూతులు మాట్లాడే బూతుల పిత. ఎంతో కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను రేవంత్ రెడ్డి ఆగమాగం చేస్తుండు. సర్వనాశనం చేసిండు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. పెన్షన్ అడిగితే లాగుల తొండలు వదులుతా, హామీలు అడిగితే పేగులు మెడలో వేసుకుంటా అంటాడు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి వచ్చానని చెప్పుకునే రేవంత్ రెడ్డి బుద్ధి.. కుక్క తోక వంకర అన్నట్టే ఉంది. గతంలో రూ. 400 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేసింది కేసీఆర్. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి సగం కాలం గడిచినా ఒక్క రూపాయి పెంచలేదు. ఇప్పటివరకు ఒక్కో అవ్వతాతకు రూ.52,000 ప్రభుత్వం బాకీ పడింది' అని చెప్పారు. 'మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నాడు. ఎవరికైనా వచ్చిందా..? ఫ్రీ బస్సు అని మగోళ్లకు డబుల్ టికెట్ కొట్టి, ఆడవాళ్లకు తిప్పలు పెట్టారు. పువ్వు గుర్తు వాళ్ళు ఎన్నడైనా ఒక్క రూపాయి పని చేశారా..? అక్షింతలు పంచడం తప్ప ఏమైనా చేశారా..? యాదాద్రి నరసింహ స్వామి గుడి కట్టింది కేసీఆర్. గజ్వేల్ వెంకటేశ్వర స్వామి గుడి, రామాలయం, శివాలయం అద్భుతంగా కట్టించింది కేసీఆర్. పనిచేసే వాళ్లకు ఓటేద్దామా..? అక్షింతలు వేసే వాళ్లకు ఓటేద్దామా..? కేసీఆర్ ముస్లిం మైనార్టీ పిల్లల చదువు కోసం ఆలోచించి రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టారు. షాదీ ముబారక్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక మైనార్టీల కోసం ఒక్క రూపాయి పనిచేశారా అన్నారు.